
ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025
5
విజయనగరం



ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాల ఎ.వి.హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 25 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సంస్థానం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు జలగం శ్రీనివాస్, పీడీ ప్రభాకర్ సహకారంతో ఈ పోటీలు చేపట్టారు. క్రీడాకారులకు దుస్తులను యాజమాన్యం సమకూర్చింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి నల్ల వెంకట్ నాయుడు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఎబిసి నాయుడు, రాజీవ్, అరుణ్ కుమార్, మురళి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషగిరి స్ఫూర్తితో..

బలమైన ఉద్యమాలు నిర్మించాలి

- ఆయన రాసిన వ్యాసాలు సమాజానికి ఎంతో అవసరం
- యుటిఎఫ్ నాయకులు శేషగిరి వర్థంతి సభలో వక్తలు
- 'తరుగులేని కీర్తి సిరి' పుస్తకావిష్కరణ



'తరుగులేని కీర్తి సిరి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శేషగిరి స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఎన్ఇపికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి, కీర్తిశేషులు కోరెడ్ల శేషగిరి 4వ వర్థంతి సభ స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. తొలుత శేషగిరి చిత్రపటం వద్ద ఆయన కుటుంబ సభ్యులతో పాటు హాజరైన నాయకులంతా నివాళులర్పించారు. అనంతరం శేషగిరి రాసిన వ్యాసాల సంపుటి 'తరుగులేని కీర్తి సిరి' పుస్తకాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, నాయకులు కె.విజయగౌరి, డి.రాము తదితరులు ఆవిష్కరించారు. అనంతరం 'భారత ఫెడరలిజం - సవాళ్లు' అనే అంశంపై లక్ష్మణరావు స్మారక ఉపన్యాసం చేశారు. తొలుత జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ స్ఫూర్తిని కలిగిన వ్యక్తి శేషగిరి అని అన్నారు. శేషగిరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే సరైన నివాళి అన్నారు. శేషగిరి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం శేషగిరి సోదరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి 'తరుగులేని కీర్తి సిరి' పుస్తక పరిచయం చేశారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, ఎన్ఇపి వల్ల రానున్న కాలంలో విద్యా వ్యవస్థ వ్యాపార సరుకుగా ఎలా మారుతుంది, మతతత్వ భావజాలం విద్యా వ్యవస్థలో ఎలా చేరుతుంది, రాబోయే కాలంలో దారితీసే పరిణామాలను వ్యాసాలు ద్వారా ముందుగానే శేషగిరి అంచనా వేసి రాశారని వివరించారు. క్లస్టర్ పాఠశాల విధానం, డిజిటల్ విద్యా విధానం వలన జరిగే నష్టాలను శేషగిరి గతంలోనే వివరించారన్నారు. నేడు ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యంగా మారిందని, అందుకోసం సన్నద్ధం కావాలని తెలిపారు.

అనంతరం మాజీ పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు 'భారతదేశ ఫెడరలిజం-సవాళ్లు' అనే అంశంపై స్మారకోపాన్యాసం చేశారు. భారత దేశంలో నేడు రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిన హక్కులపై దాడి జరుగుతుందన్నారు. సమాఖ్య స్ఫూర్తి కలిగిన రాజ్యాంగాన్ని నేడు నిర్వీర్యం చేసే విధంగా మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారన్నారు. అందులో భాగంగా జిఎస్‌టి తీసుకొచ్చి రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయం రాకుండా కేంద్ర ప్రభుత్వం లాగేసుకోవడం ఫెడరలిజానికి విరుద్ధమన్నారు. విద్య అనేది రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలోని అంశమని, అటువంటి విద్యను ఎన్ఇపి 2020 ను తీసుకొచ్చి ప్రభుత్వ విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేటు చేతుల్లో పెడుతున్నారని వివరించారు. క్రమంగా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఆయా రాష్ట్రాలు వారికి అనుగుణంగా ఎటువంటి విద్యా విధానం ఉండాలో రూపొందించుకునే హక్కును కాలరాయడం ఫెడరలిజానికి విరుద్ధమన్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయ రంగంలో కూడా మూడు నల్లచట్టాలను తీసుకొచ్చి రైతుల భూములు కార్పొరేట్ దోపిడీదార్లకు కట్టబెట్టే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేసిందన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తి కి విరుద్ధమన్నారు. దీనిపై రైతులు 450 రోజులు పాటు పోరాడి నల్ల చట్టాలను తిప్పికొట్టారన్నారు. జమిలీ ఎన్నికలు అని చెప్పి ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కలిగిన మన దేశంలో సమాఖ్య స్ఫూర్తి కి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫెడలిరిజం, లౌకిక తత్వం బలహీన పడితే దేశ ప్రజలు ప్రమాదంలో ఉన్నట్లేనన్నారు. నేడు రాష్ట్రాల హక్కులను ,రాజ్యాంగాన్ని కాపాడకోవడమే మనదేశ సమైక్యత అని, అందుకు అందరూ కృషి చేయాలని అన్నారు. శేషగిరి నిరంతరం అధ్యయనం చేయడం, వాటిని రాయడం అనేవి అందరికీ స్ఫూర్తి అన్నారు. శేషగిరిని ఆదర్శంగా తీసుకోవడమంటే ఆయన రాసిన వ్యాసాలను అధ్యయనం చేయడం, దానిని ఆచరణలో పెట్టడం కర్తవ్యంగా తీసుకోవాలన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ యుటిఎఫ్ రూపొందించుకున్న మూడు కర్తవ్యాలను అధ్యయనం, అధ్యాపనం, ఆచరణ అనే మూడు కర్తవ్యాలను అమలు చేసి ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయ నాయకుడు అయ్యారని అన్నారు. మనలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మనకిచ్చిన ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం మన కర్తవ్యమన్నారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ శేషగిరి అంటే ఒక ఉద్యమమని, వర్గ దృష్టితో ఆలోచించేవారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సమస్యలపై వర్గ దృష్టితో ఆలోచించి ఐక్య ఉద్యమాలను నిర్మించారని అన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ప్యాఫ్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, పండిత్ పరిషత్ నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎపి ఎన్జీవో సంఘం కార్యదర్శి సురేష్, పూర్వ నాయకులు వి.రాజగోపాల్, యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, సిఐటియు నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, సాహితీ స్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్, ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి పైడిరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనసూయ, కవి చలం శేషగిరిలో ఉన్న పోరాట పటిమ, ఉద్యమ స్ఫూర్తిని వివరించారు. సభలో శేషగిరి అన్నయ్య తిరుపతిరావు శేషగిరి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి మరో మూడు లక్షలు ప్రకటించారు. సభలో శేషగిరి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు నాయకులు పాల్గొన్నారు.





శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, మజ్జి శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు, కుటుంబ సభ్యులు ; సభకు హాజరైన యుటిఎఫ్, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు



రోడ్డుపై మినుములు పోసి నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు, రైతులు

అపరాలు కొనుగోలు చేయడం లేదని

రైతుల ఆగ్రహం

- మినుము పంటతో కలెక్టరేట్ వద్ద ధర్నా
- దిగొచ్చిన అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో అపరాల (మినుములు) పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. మినుములను కలెక్టరేట్ ఎదుట పోసి నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అపరాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అధికారులు, నాయకులు చెబుతున్నారని, కానీ గ్రామాల్లో మినప పంటను కొనుగోలు చేయడం లేదని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ రైతులు కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. గిట్టుబాటు ధర లేక చిన్న కారు సన్న కారు రైతులు కుదేలై పోతున్నారన్నారు. వ్యాపారులు మధ్యవర్తులు గ్రామాల్లో దోచుకుంటున్నారని, వారికి అధికారులు సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇంతవరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7400 మద్దతు ధర పెట్టినప్పటికీ బయట దళారులు రూ.5వేలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి న్యాయం చేఆయలని కోరారు. వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ అధికారి వచ్చి సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని తేల్చి చెప్పడంతో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ డిఎం వచ్చి రేపటి నుంచి కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లోకావరపు ఆదినారాయణ మూర్తి, కౌలు రైతు సంఘం నాయకులు కసిరెడ్డి నారాయణరావు, విసినిగిరి సర్పంచ్, ఉపసర్పంచ్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీరామ్మూర్తి, సిరికి వెంకట సత్య నారాయణ, సీర కృష్ణ, పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మికులు సంఘం జిల్లా కార్యదర్శి గాడు అప్పారావు, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ, కొత్తవలస

వేపాడ, కొత్తవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్లను సమగ్రశిక్ష సెక్టోరియల్ బృందం సోమ వారం పరిశీలించింది. సిఎంఒ వి.ఆదినారాయణ, ఎపిఒ వి.గోపిచంద్, ఎఎంఒ బి.ప్రసాద్, అసిస్టెంట్ సిఎంఒ కె.రామారావు పరిశీలించారు. ఇంత వరకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాల భాస్కరరావు, జి.శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌ఎంటిలు, తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలిస్తున్న అధికారులు

సిటియులో గిరిజన విద్యార్థులకే

అధిక సీట్లు కేటాయించాలి

- కేంద్రానికి లేఖ రాస్తానన్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు
- సిటియు సందర్శన, నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం, మెంటాడ

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల్లో గిరిజన విద్యార్థులకే అధికంగా విద్యావకాశాలు కల్పించాల్సి ఉందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సంబంధిత చట్టంలో మార్పులు తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని, ఇదే విషయమై కేంద్రానికి లేఖ రాస్తామని వెల్లడించారు. సోమవారం నగరంలోని గాజులరేగ ప్రాంతంలో ఉన్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిఐటియు వైస్ చాన్సలర్ టి.వి.కట్టమణి, ఇతర అధికారులు, అధ్యాపకులతో భేటీ అయి విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, గిరిజన విద్యార్థులకు కల్పిస్తున్న విద్యావకాశాలు, ఈ ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధిలో యూనివర్సిటీ నిర్వహిస్తున్న పాత్రపై చర్చించారు. సిటియు నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. గిరిజన విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బంది అవసరమైన సంఖ్యలో లేరని గుర్తించామని, దీంతో అధ్యాపకులు, బోధన సిబ్బందిపై అధికభారం ఉంటోందని గమనించామని శంకరరావు తెలిపారు. దీనిని నివారించేందుకు విశ్వవిద్యాలయ అవసరాలకు తగినట్టుగా అధ్యాపకులు, బోధన సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉందని కేంద్రానికి నివేదించనున్నట్టు చెప్పారు. ఈ ప్రాంత గిరిజనులకు ఎదురయ్యే సికిల్‌సెల్ ఎనీమియా, ఇతర ఆరోగ్య సమస్యలపై వారిలో అవగాహన కల్పించి వాటి నుంచి రక్షణ కల్పించే దిశగా యూనివర్సిటీ చొరవ చూపాలని కోరారు.



యూనివర్సిటీ నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

తొలుత జెడ్‌పి అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, విజయనగరం ఆర్‌డిఒ కీర్తి తదితరులు ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసి గిరిజన విశ్వవిద్యాలయంలో వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు.

పనులు పరిశీలన

అనంతరం మెంటాడ మండలం కుంటినవలస వద్ద యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను ఎస్.టి.కమిషన్ చైర్మన్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జాతీయ రహదారి నుంచి విశ్వవిద్యాలయ క్యాంపస్‌కు అనుసంధాన రోడ్డు నిర్మాణం పూర్తిచేయాల్సి ఉందని యూనివర్సిటీ అధికారులు వివరించారు. పనుల పరిశీలనలో బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు, యూనివర్సిటీ ఎఒ సూర్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, మెంటాడ, దత్తిరాజేరు తహశీల్దార్లు వెంకటరావు, విజయభాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాల కంబాల

- నేడు దాడితల్లి సిరిమానోత్సవం
- ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి పండగ సందర్భంగా సోమవారం ఉయ్యాల కంబాల ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలు, పూజారిని గ్రామంలో ఊరేగించారు. పూజారిని ఉయ్యాలలో ఊపి ఉయ్యాల కంబాల నిర్వహించారు. దాడితల్లి ఆలయం వద్ద రెండో రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి యాత్రికులు క్యూ కట్టారు. బొబ్బిలి చుట్టుపక్కల 12 గ్రామాల్లో ఈ పండగను వైభవంగా నిర్వహిస్తున్నారు. దాడితల్లి పండగలో భాగంగా సిరిమానోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. గొల్లపల్లిలో సిరిమానోత్సవాన్ని మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభిస్తారు. గొల్లపల్లి, బొబ్బిలిలో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చెప్పారు.

300 మందితో బందోబస్తు

గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. గొల్లపల్లి, బొబ్బిలిలో సోమవారం ఎస్‌పి పర్యటించారు. సిరిమానోత్సవ రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. గొల్లపల్లి వనంగుడి, దాడితల్లి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గొడవలు, అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించాలని గ్రామపెద్దలను ఆదేశించారు. అల్లర్లు, గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో గొల్లవీధి - రావువారివీధి మధ్య జరిగిన గొడవపై ఆరా తీశారు. గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి భవ్యరెడ్డి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌ను ఆదేశించారు.

యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండగకు వచ్చే యాత్రికులు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ పండగకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. పైపులైన్ సమస్య ఉన్న ప్రాంతాలకు ఒక మున్సిపల్, రెండు అద్దె ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయాల వద్ద ప్రత్యేక కార్మికులను నియమించి పారిశుధ్య పనులు చేస్తున్నామన్నారు. సిరిమానోత్సవం జరిగే రహదారులపై గోతులను పూడ్చినట్లు వివరించారు. సిరిమాను వెనుక పారిశుధ్య కార్మికులను ప్రత్యేక బృందంగా నియమించి, ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.



ఉయ్యాల కంబాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మే 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ తెలిపారు. ఈ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తమ చాంబర్లో సోమవారం సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 8:30 నుంచి 12గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదున్నర గంటల వరకు జరుగుతాయని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 164 అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్దా, పరీక్ష పేపర్లు తరలించే సమయంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. కన్వీనర్, రీజనల్ ఇనెస్పెక్షన్ అధికారి ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ, జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు సుమారు 15వేల మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 6వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు, సిట్టింగ్ స్క్వాడ్ ఉంటాయని, ప్రతి 20 పరీక్షా కేంద్రాలకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 52, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం 26 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో విద్యుత్తు శాఖ ఎస్ఇ లక్ష్మణరావు, పోలీస్, ఆర్టీసీ, పోస్టల్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిశ్రమలకు అనుమతులు

విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తులకు ప్రోత్సాహం ● జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

పరిశ్రమల స్థాపన కోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులను మంజూరు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో ద్వారా గడువు లోపల అనుమతులను మంజూరు చేసి, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. గత మూడు నెలల్లో పరిశ్రమల స్థాపనకు 149 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటివరకు 138 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. వీలైనంత వేగంగా మిగిలిన వాటిని అనుమతించాలని చెప్పారు. వీలైనంత వేగంగా రుణాలను మంజూరు చేయాలని బ్యాంకులకు సూచించారు. చేతివృత్తిదారులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోందని, వీలైనంత వేగంగా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బొబ్బిలి వీణల తయారీ లాంటి అరుదైన కళలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేయాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

పిఎం విశ్వకర్మ యోజనకు సుమారు 86,386 దరఖాస్తులు అందగా, మూడు దశల్లో వీటిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 1,080 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేయడం పట్ల ఇన్‌ఛార్జి కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఇ సర్వేను పునఃసమీక్షించాలని సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం స్థలం దాదాపు 15 ఏళ్ల క్రితం స్థలం తీసుకొని, పరిశ్రమను స్థాపించకుండా మళ్లీ గడువు కోరడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని, పరిశ్రమ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, సహాయ సంచాలకులు బి.రామకృష్ణ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీ మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌పి గ్రీవెన్స్‌కు 32 అర్జీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి వకుల్ జిందాల్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 32 అర్జీలు అందాయి. వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో ఎస్‌పి వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 15, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లు 3, ఇతర అంశాలకు సంబంధించినవి 11 ఫిర్యాదులు ఉన్నాయని ఎస్‌పి తెలిపారు. ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో పంపాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 177 వినతులు

- వినతులను సంతృప్తి చెందేలా పరిష్కరించాలి
- ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ప్రధానంగా ఆడిట్ టీం రిమార్కులలో సంతృప్తి చెందినట్లు రాయాలని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 177 వినతులు అందాయి. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ కీర్తి డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవిన్యూ శాఖకు అత్యధికంగా 87 వినతులు అందాయి. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పెండింగ్ వినతులు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.

రెండు రోజుల పాటు జిల్లాలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మున్సిపల్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తగు జాగ్రత్తలు తీసుకుంటూ నష్టాలు సంభవిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు.

రూ. 50 కోట్లు, ఆ పైబడిన ప్రాజెక్టుల వివరాలను అందజేయాలి

అన్ని శాఖల అధికారులు 50 కోట్లు , ఆ పైబడి నిధులతో మంజూరైన ప్రోజెక్టుల వివరాలను నిర్దిష్ట ప్రొఫార్మాలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వారికి వెంటనే అందజేయాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు.

నగర పాలక సంస్థలో వినతులు స్వీకరణ

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి వినతులు వచ్చాయి. కమిషనర్ పల్లి నల్లనయ్య వినతులు స్వీకరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. రెండు వినతులు రాగా, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులకు అప్రమత్తం చేస్తూ నీటి పంపిణీ చేపడుతున్నామన్నారు. ఆంధ్ర జలాశయం నుంచి ఇప్పటికే నెల్లిమర్ల వాటర్ వర్క్స్ వద్దకు నీరు చేరిందని కావున వేసవిలో నీటి ఇబ్బందులు ఉండకపోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఇఇ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రమణమూర్తి, మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్



వైద్యులకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

ఆశాల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని సోమవారం స్థానిక సిహెచ్‌సిలో వైద్యులకు వారు నోటీసు అందజేశారు. తొలుత సిహెచ్‌సి ఎదుట నిరసన తెలిపారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి ఆశాలను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు శాంతి, ఎం.లక్ష్మి, మాలతి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ఆశాల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో పిరిడి పి.హెచ్.సి వైద్యులు రఘు వంశీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు పాల్గొన్నారు.

ముగ్గురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి వేపాడ

మండలంలో ముగ్గురు డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించింది. వేపాడ డిజిటల్ అసిస్టెంట్ కసిరెడ్డి సత్యవతిని శృంగవరపుకోట పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేశారు. నల్లబెల్లి డిజిటల్ అసిస్టెంట్ ఆర్.సత్యంనాయుడు లక్కవరపుకోట మండలానికి, రామస్వామిపేట డిజిటల్ అసిస్టెంట్ ముమ్ములూరు సంతోష్ ఎఎస్‌పేట పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు వారికి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు.

కిశోర వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి-లక్కవరపుకోట

కిశోర వికాసం కార్యక్రమంపై సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్వాడీలు, మహిళా పోలీసులు, ఎంఎల్‌హెచ్‌పిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వియ్యంపేట ఐసిడిఎస్ పిఒ లక్ష్మీబాయి మాట్లాడుతూ కిశోర వికాసం కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. ఈ నెల పదో తేది వరకు అంగన్వాడీల్లో కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు పి.భాగ్యలక్ష్మి, వి.రామకృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వేంద్రాం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌జెడి చిన్మయిదేవి

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని వేంద్రాంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.చిన్మయిదేవి సోమవారం పరిశీలించారు. లబ్ధిదారులుకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రతి రోజూ అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో ములగాకు ఉపయోగించు పద్ధతిని ఆర్‌జెడి లబ్ధిదారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి, సూపర్‌వైజర్ జానకి పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.50 వేలు సాయం

ప్రజాశక్తి - భోగాపురం

రామాలయం నిర్మాణానికి రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తనవంతు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. నెల్లిమర్ల మండలం సతివాడ గ్రామంలో రామాలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ పెద్దలు పోలిపల్లిలో బంగార్రాజును కలిశారు. తన వంతు సహాయంగా 50వేలు రూపాయలను అందజేశారు. గ్రామస్తులు కోరాడ శ్రీను, రెల్లి వెంకటేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై టోల్ గేట్ వద్ద అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. దీనిలో భాగంగా ఎమ్మెల్యే లోకం మాధవి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుపై హోం మంత్రి అనితకు ఇటీవల వినతి పత్రం అందజేశారు. దీంతో త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యావని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నదాన నిర్వాహకులకు సన్మానం

మెరకముడిదాం: మండలంలోని చెల్లాపురంలో శ్రీకోదండ రామాలయం ప్రతిష్ట మహోత్సవాన్ని గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పిన్నింటి అచ్చింనాయుడు కుటుంబ సభ్యులను సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్తు కట్

విజయనగరం టౌన్ : గాజులరేగ సబ్‌స్టేషన్ పరిధిలో మెడికల్ కాలేజి వద్ద ఎపిఎంఎస్ఐడిసి వారు బోరు తవ్వనున్నందున మంగళవారం 11కెవి కొండకరకాం రూరల్ ఫీడర్‌లో విద్యుత్ నిలిపివేస్తామని డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున కొండకరకాం పరిసర ప్రాంతాలకు ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

'నా ఇంటికి తోవ ఇప్పించాలి'

ప్రజాశక్తి-వేపాడ

తన ఇంటికి రహదారి సౌకర్యం కల్పించాలని మండలంలోని సింగరాయి గ్రామానికి చెందిన నిరుజోగి చిన్నంనాయుడు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ఎంపిడిఒ సూర్యనారాయణకు ఆయన వినతి అందించారు. గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ పెద్దల ద్వారా స్థలాన్ని కొనుగోలు చేశానని చెప్పారు. ఆ స్థలానికి తోవ లేకుండా ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టినట్లు ఫిర్యాదుచేశారు. దీంతో తన స్థలానికి దారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. వెంటనే ఎంపిడిఒ స్పందిస్తూ గ్రామానికి వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఇఒపిఆర్‌డి రవికుమార్‌ను ఆదేశించారు.



ఎంపిడిఒకు వినతినిస్తున్న చిన్నంనాయుడు

రైతుల కుటుంబాలకు పరిహారం అందజేత

ప్రజాశక్తి-బాడంగి

విద్యుదాఘాతంతో మరణించిన రైతుల కుటుంబాలకు విద్యుత్తు సంస్థ ద్వారా వచ్చిన పరిహారాన్ని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అందజేశారు. గతేడాది తెర్లాం మండలం అంట్లవారకు చెందిన రైతు కోట రామారావు తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టే క్రమంలో మోటార్ వైర్లను సరిచేస్తుండగా విద్యుత్తు షాక్‌తో మృతి చెందారు. బాడంగి మండలం గజరాయునివలస గ్రామానికి చెందిన నల్ల అప్పలనాయుడు కూడా పొలంలో విద్యుదాఘాతంతో మరణించారు. దీంతో ఎమ్మెల్యే బేబినాయన సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, విద్యుత్తు సంస్థ తరపున పరిహారం అందేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇరు కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున ఎమ్మెల్యే, బుడా చైర్మన్ అందజేశారు. గతంలో ఇటువంటి మరణాలకు సంబంధించిన పరిహారం రావడానికి కొన్నేళ్లు పట్టేదని, ఇప్పుడు ఎమ్మెల్యే చొరవతో అతి తక్కువ కాలంలో ఈ ఆర్థిక సహాయం మంజూరైందని విద్యుత్తు శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి, ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ మూడడ్ల సత్యం, డిప్యూటీ డిఇ భానునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ సూచనలతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. వర్షాలు వల్ల ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తక్షణమే కంట్రోల్ రూమ్ నెంబర్ 98499 06486కు సమాచారం అందించాలన్నారు. భారీ చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగులు సమీపంలో ప్రజలు ఉండరాదని సూచించారు.

అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది ఎన్.సి.ఎస్ రోడ్ లో ఉన్న నిర్మాణాన్ని తొలగించి వేశారు. గతంలో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా దుకాణ సముదాయాన్ని నిర్మించడంపై వచ్చిన ఫిర్యాదులు నేపథ్యంలో నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాన్ని తొలగించాలని నోటీసులు జారీ చేయగా సదరు ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయించారు. అయితే తాజాగా గౌరవ హైకోర్టు నుండి వచ్చిన ఆదేశాల మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందించి తొలగింపజేశారు

ఎంవిజిఆర్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- డెంకాడ

ఎంవిజిఆర్ కళాశాలలో రక్షణ-ఆధారిత నాయకత్వ శిక్షణ కోసం మానసిక ఆప్టిట్యూడ్ అసెస్మెంట్‌పై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 5 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, విద్యార్థులలో ఆఫీసర్ లాంటి గుణాలను గుర్తించడానికి, అంచనా వేయడానికి అధ్యాపక సభ్యులను సిద్ధం చేయడానికి ఈ శిక్షణ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రమేష్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఇండియన్ కోస్ట్ గార్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ దేవానంద్ జి పిళ్ళై (రిటైర్డ్), ఇండియన్ నేవీ కమోడోర్ మనోజ్ భురారియా (రిటైర్డ్) వర్చువల్‌గా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులలో నాయకత్వ సామర్థ్యాన్ని గుర్తించి, మార్గనిర్దేశం చేయడానికి అధ్యాపకులను సన్నద్ధం చేయడానికి ఉద్దేశించిన మానసిక పరీక్షా పద్ధతులు గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్, అన్ని డీన్లు, విభాగాధిపతులు, కళాశాలలోని వివిధ విభాగాల నుండి అధ్యాపకులు చురుగ్గా పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేష్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన సోమవారం విజయనగరం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలల్లో అంటే ఒకటి నుంచి ఐదు తరగతిలో మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలనే కొనసాగించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండు ఎస్జీటీ పోస్టులు ఉంచాలని,ప్రతి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, పీడీ పోస్టులు మంజూరు చేయాలని, 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండవ సెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను తక్షణమే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, పి.వి.ప్రసాద్, మజ్జి రమేష్ ,గురుమూర్తి, తిరుమలరెడ్డి శ్రీనివాసరావు, సిహెచ్ కోటేశ్వరరావు, మర్రాపు శ్రీనివాసరావు, కె.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోమ్స్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ విజయనగరంలో ఉన్న కొన్ని చిల్డ్రన్స్ హోమ్‌లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కెఎల్ పురం లో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న శిశు గృహం, మిరియం బాలుం, బాలికల చిల్డ్రన్ హోం, నవజీవన్ చిల్డ్రన్ హోం , లవింగ్ షెఫర్డ్ చిల్డ్రన్ హోం, రెయిన్‌బో బాలుర మరియు బాలికల చిల్డ్రన్‌హోంను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రెయిన్‌బో చిల్డ్రన్ మోం బాలికల హోంలో ముగ్గురు బీహార్ నుంచి తప్పిపోయి వచ్చిన బాలికలుగా గుర్తించారు. వారు గత నాలుగేళ్లగా వసతి గృహంలో ఉంటున్నారు. వారి వివరాలు సేకరించి తల్లిదండ్రుల వద్దకు చేర్పించే ఏర్పాట్లు చేస్తామని గృహ నిర్వాహకులకు తెలిపారు.

కనీసం రూ.300 వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదార్లకు కనీస వేతనం రూ.300 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కోరాడ పేట బాయిలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించి వేతనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేతనదార్లు గ్రామానికి 2 కిలోమీటర్లు దూరంలో పనులు చేస్తున్నామని రూ.142, రూ.150 మాత్రమే వేతనం వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కోరాడపేట పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల్లో 400మంది పని చేస్తున్నా వారికి ఇంత తక్కువ వేతనం రావడం దారుణమన్నారు. ఎంత కష్ట పడి పనిచేసినా తక్కువ వేతనాలు రావడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరుకులు ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ వేతనం ఎలా సరిపోతుందని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, వేతనదార్లకు వడదెబ్బ, ఇతర గాయాలు తగిలితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. ఉపాధి పథకాన్ని రక్షించుకోవడానికి ఉపాధి వేతన దార్లు సంఘటితంగా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మెరకముడిదాం మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం తమ ఛాంబర్లో అభినందించారు. వారు మరింతగా రాణించి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పదోతరగతిలో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను విమాన ప్రయాణం చేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం గోపన్నవలస జెడ్‌పి ఉన్నతపాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మరడాన సత్యారావు తన మాట నిలబెట్టుకున్నారు. ఈ మేరకు జిల్లాలోనే మొదటి స్థానం సాధించిన గర్భాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి సంగరెడ్డి వివేక్ (593), తృతీయ స్థానం సాధించిన బైరిపురం హైస్కూల్ విద్యార్థి తాడేల రేవంత్ (591) తదితరులను విమాన ప్రయాణం చేయించి, ఇన్‌ఛార్జి కలెక్టర్ వద్దకు తీసుకువచ్చారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఇన్‌ఛార్జి కలెక్టర్ అభినందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఒ గౌరీశంకరావు, ఉప విద్యాశాఖాధికారి కెవి రమణ, ఎపిసి రామారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ టి.సన్యాసిరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, మరడాన ఈశ్వర్రావు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రభుత్వ ఐటిఐలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డులో గల ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి. భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా నైపుణ్య కేంద్రంలో వైట్ డెవలపర్ కంప్యూటర్ కోర్స్, సోలార్ ప్రీ ఇన్స్టాల్ ఎలక్ట్రికల్ కోర్స్, ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈ శిక్షణకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, 10వ తరగతి సర్టిఫికెట్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజు ఫోటోతో ఈ నెల 10లోపు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 917286042743, 918121450657 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బాడంగి

బాడంగిలో వారం రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డి కుప్పలు కాలిపోయిన రైతులకు ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. న ఎం.చంద్రినాయుడు, సింహాచలం, శ్రీను, గొట్టాపు గోపాలం, అంబటి తవిటినాయుడు కు రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ రమేశ్, ఎంపిటిసి శ్రీనివాసరావు అందించారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలు సజీవ దహనం

ప్రజాశక్తి - చీపురుపల్లి

గరివిడి మండలంలోని కోనూరుకు చెందిన ఎడ్ల అసిరి తల్లి (70) అనే వృద్ధురాలు తానుంటున్న పురింటిలో మంటలు అంటుకోవడంతో సజీవ దహనం అయ్యింది. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి గరివిడి తహశీల్దార్ సిహెచ్ బంగారు రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో నివాసం ఉంటున్న ఎడ్ల అసిరి తల్లి ఇంటిలో గ్యాస్ లీక్ అవడంతో ఇంటికి నిప్పు అంటుకుంది. దీంతో వృద్ధురాలు అయిన అసిరి తల్లి మంటల్లో చిక్కుకొని మృతి చెందిందని తహశీల్దార్ తెలిపారు. విషయం తెలుసుకున్న గరివిడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. స్థానికుల సమాచారం మేరకు చీపురుపల్లి అగ్నిమాపక శాఖ అధికారులు వెళ్లి మంటలార్పి మృతదేహాన్ని బయటికి తీశారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లతో సిఐ షణ్ముఖరావు

23 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కొత్తవలస

మంగళపాలెం జంక్షన్ వద్ద కారులో తరలిస్తున్న 23 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు సోమవారం మంగళపాలెం జంక్షన్ వద్ద ఎస్ఐ మన్మథరావు వాహన తనిఖీలు చేపట్టారు. కొత్తవలస జంక్షన్ నుంచి విశాఖపట్నం వైపు మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి.. పోలీసులను చూసి బైక్ వదిలి పారిపోయాడు. వెంటనే దానికి 50 అడుగులు దూరంలో కారును డ్రైవర్.. పోలీసులను చూసి వెనక్కి తిప్పే ప్రయత్నం చేశాడు. వెంటనే పోలీసులు కారును ఆపి తనిఖీ చేశారు. కారు నాలుగు డోర్ల లోపలి భాగాల్లో చిన్న ప్యాకెట్లతో ఉన్న గంజాయిని గుర్తించారు. 48 ప్యాకెట్లలో 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రేగిడి మండలానికి చెందిన గంజాయి రవాణా చేస్తున్న పాలవలస జనార్దన్ రావు, పాలవలస రాంబాబును అరెస్టుచేశారు. బైక్, కారును సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ షణ్ముఖరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - భోగాపురం

గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగింది. భోగాపురం గ్రామానికి చెందిన దుబ్బక సంతోష్ (30) ఎప్పటివలె సోమవారం ఉదయం కల్లానికి వెళ్ళాడు. బహిర్భూమి కోసం రోడ్డు దాడుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో సంతోష్ హైవే పైన ఉన్న డివైడర్ పై తుళ్ళిపడి మృతి చెందాడు. ఇది చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బల్లకృష్ణ రాయపురంలో సోమవారం బొత్స రమణమ్మ (75) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పార్వతీపురం సిఐ గోవిందరావు కథనం ప్రకారం.. రమణమ్మ ఆదివారం రాత్రి రమణమ్మ ఒక్కరే ఒంటరిగా ఇంట్లో నిద్రించింది. సోమవారం తెల్లవారి లక్ష్మీ తన ఇంటికి వచ్చి తల్లిని నిద్రలేపగా విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించింది. రమణమ్మకు మెడ నొప్పి కారణంగా మెడకు బెల్టు వేసుకొని నిద్రిస్తుం టుంది. అందువల్లే తన తల్లి చనిపోయిందని తొలుత కుమార్తె భావించింది. మెడపై తట్లు ఉండడంతో ఎవరో గొంతునులిమి హత్య చేశారని ఆరోపించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ గోవిందరావు ఆధ్వర్యంలో ఇన్చార్జి ఎస్ఐ నీలకంఠం, సిబ్బంది, క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ : మండలంలోని లోతుగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి సోమవారం 30 మద్యం సీసాలను ఆంధ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడు మెంటాడ నుంచి బస్సులో మద్యం సీసాలు తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆంధ్ర పోలీసుస్టేషన్ వద్ద బెల్ట్‌షాప్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేశారు.

IN THE HON'BLE COURT OF THE II ADDITIONAL CIVIL JUDGE JUNIOR DIVISION (Mobile Court) VIZIANAGARAM
O.S:283/2023

Between:-
State Bank of India Fort Branch represented by SRI TRILOCHAN BEHARA, S/o RAGHUNADH BEHARA, aged 45 Chief Manager Fort branch Vizianagaram. .....Plaintiff
And:
NAGABATHULA RAJA .....Defendant

To,
NAGABATHULA RAJA
S/o BABJI,8-113--5th,
APSP Quarters,
Chintalavalasa,
Vizianagaram 535005.

NOTICE

Please take notice that the above matter is posted to **07-05-2025** .You shall appear in person or through your Advocate, by **10.30 AM,** failing which the matter will be decided Ex Partee.

P.V.S. PRASAD
ADVOCATE FOR THE PLAINTIFF
VIZIANAGARAM,
CELL: 7799955633.

BEFORE THE HONOURABLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT VIZIANAGARAM
C. C. No. 10 / 2025

Between:
Vusirikala Muralikrishna
S/o Late Jayarama Murthy, residing at D No.24-2/1-9/2, Sunkaraveedhi, Dasannapeta, Vizianagaram
...Complainant
And:
1. **The Managing Director / Authorized Signatory / Owner Sri Sureddy Babu Vidya Sagar, Buy Best 'E' Scooters (Komaki),** # 1 - 8 - 8A, Ettu Bridge Down, beside ICICI-ATM, Opp. Ashok Gajapathiraju Gari Bungalow, Vizianagaram, Andhra Pradesh - 535003 And another
.... Opposite Parties

NOTICE

Opposite Party – 1
The Managing Director / Authorized Signatory / Owner Sri Sureddy Babu Vidya Sagar, Buy Best 'E' Scooters (Komaki), 1 - 8 - 8A, Ettu Bridge Down, beside ICICI-ATM, Opp. Ashok Gajapathiraju Gari Bungalow, Vizianagaram, Andhra Pradesh - 535003

Please take notice that in the **C.C. No: 10/2025,** The Hon'ble Consumer Commission at Vizianagaram directed the Complainant to take out the Paper Publication against the 1st opposite party. Please take notice that the C.C. No: 10 / 2025 posted to **08-05-2025 at 10.30 am.** Here you are directed to appear either personally or through council before the Hon'ble Consumer Commission at Vizianagaram, if you failed to appear than the matter will be proceed in your absence.

HENCE, THIS NOTICE

P. KIRAN KUMAR, S. SUKANYA PRIYA
Advocates
MOBILE: 83414 14771 / 9963633653